# ఏందారి?

## ఎమ్. రామకోటి

ఆ అర్ధరాత్రి.

విశ్వసాక్షి తెరచిన వెయ్యికళ్ళలా మోసిపోయే చుక్కలతో, చిల్లులుబడ్డ నల్లని చినీ చాందినీలా వుంది ఆకాశం. మగతగా అరగాక నిద్రలో గురక పెట్టే గుడ్డి రాకాసిలా గుర్రుమంటోంది సముద్రం. పొలికేక పెట్టే తీతికలా కొండ గుండెల్లో దూరిన యీదురుగాలి వుండుండి కీచు గొంతు పిశాచిలా వెకిలి నవ్వు నవ్వుతోంది. వికటాట్టహాసం చేస్తోంది.

భారతికి పొద్దులు.

ఆ క్షణం వెయ్యికళ్ళ విశ్వసాక్షి రెప్పలార్పడం మరచి తెల్లబోయేడు. బిక్కచచ్చి చుక్కలు మిణుకుమిణుకు మంటున్నాయి. ఆకలి చిచ్చుకి బెక్కి బెక్కి యేడ్చే అన్నార్తిలా, యీనిన పులిలా గురగురలాడుతోంది సముద్రం. ధుర్వ్యాళం పట్టు బిర్ర బిగుసుకుపోయిందిగాలి. నల్లమందు మేసిన ఏనుగుల మందలా, కాటుకరాసుల్లా తంగపడిపోయేయి కొండకోనలు.

కాలం ఎనుబోతు మెడలో కంచుగంటలు పన్నెండుమార్లు ఘణేల్మన్నాయి. పగిలే అగ్ని పర్వతాల్లా కోటి శతఘ్నులు పటాక్ పటాల్మన్నాయి. మత్తువదిలిన జీవితం జూలు దులిపింది. ఆవులించి ఆశ రంకె వేసింది. నేం దద్దరిల్లింది. వంగివంగి వాలిపోయింది.

పసిడి పొలాలమీద పైమరచి దిబ్బున్న శాశ్వత కమలాలు మిడతల దండు తుళ్ళిపడి పడమటి దిక్కువక్కి యెగిరిపోయింది.

భారతిగుండె జల్లుమంది.

ఉషాబాల పందెపు గుర్రాల్లా రెపరెపలాడుతూ పావురాలు కటికికటిలో వెలుగులు చిలుకుతూ విచిత్ర విన్యాసాలు జరిపేయి. స్వస్తి స్వస్తిఅంటూ కువకువలాడి శాంతిలాస్యాలు చేసేయి.

భారతి కడుపు చించుకుంది. కాళ్ళ మీదపడిన పురిటి కందుని చూసి గుండె బండయిపోయి నిర్ఘాంతపోయింది.

భారతిమీద కాలం ముద్ర వెయ్యలేకపోయింది. ఒకనాటి చక్కదనాల ఛాయలింకా ఆమెలో పీతలైపోలేదు.

వయసులో పరువం గరువం యింకా వాడిపోలేదు. కరిగే ఆ కళ్ళలో జీవనదులుప్పొంగుతాయి. అవి గంగా గర్భాలు, కాళింది సైకతాలు. ఆమె వడిచే వింధ్యాద్రి. మేరుధీర హిమవన్నగం చెక్కు చెదరని గుండె. విందుకుండ. మంచుకొండ. అందరికీ ధైర్యం. కొంగు బంగారం.

పరచుకున్న నిరాశలా, బట్టబయలు దరిద్రంలా, పులి చీల్చిన పాడియావు యెర్రని మాంసం డొక్కలా. మిడతలు మెక్కి చవిటిపర్రలైన మాగాణీలు కనుచూపుమేర. గుండె దొలిచే భయం కరపిశాచపిండం కంటిముందు. కొండంత భారతి కుంగిపోయింది. కొంగు బంగారం మగ్గిపోయింది, వాడి వడిలి వేలాడే ఒకనాటి పచ్చని యింటి తోరణంలా దిక్కుమాలినంగా గుమ్మంలో వూగాడుతూ వెర్రి చూపులు చూస్తోంది. అకస్మాత్తుగా జుత్తు నెరిసింది. పీచుకడుతోంది [illegible]నుగై మూగచూపులు చూస్తోంది భారతి.

కళ వెలవగు మోము కలతెందుకు కలిగిందో! నెలలు నిండి తేలికపడ్డ తల్లి ఎందుకు వెలవెల బోతోందో!

ఆ మూగబాధచూసి భరించలేక పరుగుపరుగు వాళ్ళు నొక్కించేరు. వద్దంటున్నా భారతిని పక్కకి తొలగించి పురిటిలో ప్రవేశించేరు. మంచం మీద ప్రకృతి వైపరీత్యం చూసి స్తంభించిపోయేరు.

చేప మొప్పల చేతులు, మరుగుజ్జు కురచకాళ్ళు, వుందా లేదా అన్నమెడ. దానిమీద తలలేదు. పెద్దనోరు నేలా నింగీ తాకుతూ తెరచి యీసుకుంటున్న నోరు చంద్రుణ్ణి మింగబోయే రాహూలాగ, లోకాన్ని చప్పరించేందుకు మెలికలు తిరిగి యెగబాకే నాలుక. చెవులూ కళ్ళూ, ముక్కూ అన్నీ చిన్న చిన్న నోళ్ళు. విడ్డవీ విడతుబోన్నవీ అన్నీ నోళ్ళు. నోళ్ళు నోళ్ళు. ఒళ్ళంతా నోళ్ళమయం. నోటికి కోటి గొంతుకలు, కోటానకోట్ల నలభై యాభై కోట్ల గొంతుకలు. అలవోకగా జేసే అట్టహాసానికి లోకం గంగిళ్ళెత్తిపోతోంది. గుండ్రంగా, వుండ్రంముక్కలా బలిసిన మువ్వన్నెల సముద్రపు చేపలా, ఆవులించే వృతాసుడిలా వుందా పురిటి పిండం, కుక్కలు మూలిగినట్టు, నక్కలు నవ్వినట్టు, తోడేళ్ళు యికిలించినట్టు కోటి గొంతుకలు విచ్చి చేసిన చప్పుళ్ళ గందరగోళం. పిశాచగణ సమవాకాశం, రాకాసిమూకల హాహాకారం. ఆ ఆవురు బావురు అరుపుల అర్థం అన్నీ భాషలలోనూ ఒకటే ఆకలి, అంతూ పొంతూలేని ఆకలి.

ఏవగించుకున్నారు. అసహ్యించుకున్నారు, చీదరించుకున్నారు, కంగారుపడి బెదిరిపోయేరు. అందరికళ్ళూ భారతి మీద పడ్డాయి. తలెత్తుకోలేక సిగ్గుపడి మొహం దాచేసుకుంది భారతి.

భారతిబిడ్డ - పిశాచపిండం దాను

రాన్న ఎదగడం ఆరంభించింది. కరుకు మీసాలు పెంచింది, బిరుకు వజ్రాల గోళ్ళ పంజా విప్పింది. పిచ్చుకత్తు లాగ తళతళలాడే కోరలు తిప్పింది. అందినంతా కబళించేస్తోంది. భారతి యిల్లు గుల్లెయింది. ఒళ్ళుడొల్లయింది. రెక్కలు ముక్కలు చేసుకున్నా, కన్న బిడ్డకొక్క కబళంపెట్ట లేకపోతోంది. కడుపు చిచ్చు భరించలేక బిడ్డ బావురు మంది. ఊరు కంపించింది, గడగడ లాడిపోయింది. గాదులుతెరిచి రాకాసి నోరు మూయబోయేరు, గాదులు కరిగి పోయినా, ధాన్యరాసులు ఒక్కబుగ్గకి రాలేదు. ఒక్కపంటికిందకి చాల్లేదు. దిగులుపసిపోయింది వూరు, దిక్కు మాలిపోయింది. పంట పొలాలు బీడు వారిపోయేయి. పొయ్యిల్లో పిల్లులు పడుకున్నాయి. కుంభకర్ణుడిలా లేచి ఆ పిశాచం అందర్నీ ఫలహారం చేసే స్తుందేమోనని వణికిపోయేరు.

పెద్దరికం పుచ్చుకున్న పండితుడు పులులతో ఆడుకున్నాడు, అయినా పావురాలెగరేస్తున్నాడు. వెక్కిరించే పొలాల్ని చూసేడు, బక్కచిక్కిన పాలేర్లని చూసేడు, పగిలిపోయిన కుండల్ని చూసేడు. మాడిపోయిన మల్లెచెండుల్ని చూసేడు. అనాధల అసహాయపు చూపులు చూసేడు. పొగలూసెగలూ కక్కే మహమ్మారి రక్కసి పిండాన్ని చూసేడు.

"ఈ బకాసురుణ్ణి తరిమెయ్యాలి. యీ మహమ్మారిని మచ్చికచేసి భూమట్టం చెయ్యాలి. దీని అంతుచూడాలి. ఎలాగ ఎలాగ?" అని ఘోరుమన్నాడు

"ఏం దారి మొర్రో" అని వెర్రి నోరూ బాదుకున్నాడు.

"ఇబ్బందుల్లోనే నిబ్బరంవుండాలి .... ఆపదల్లోనే దయిర్యంవుండాల."

తలెత్తి చూసేడు పండితుడు.

ఉర్లావడికాసులు, తాతాజాలయ్య (అసలు పేరు జలగయ్య; ఆనోటా ఆనోటా అరిగిపో జలయ్య అయి పోయింది) చేతులు కట్టుకుని సుభాషితం వల్లిస్తున్నారు.

"సిత్తం సిత్తం ..దిగులడిపోతే ఏటీ సెయ్యనేం. ఏలోర్నరు తల్సుకుంటే యిదెంత బాబూ" అన్నాడు దాలిమయ్య.

పద్దెనిమిదివున్న కుటుంబాలూ జమా జెట్టీలాగ పారాహుషార్ అని పండితుడి చుట్టూ చేరేరు. ఆశ్చర్యపోయేడు పండితుడు. "కాలికింద నేల కోసుకు పోతోంది. వూబిలో దిగిపోతున్నాం. ముందీ మహమ్మారి నోట్లోంచి బయట పడాలి. ఏం చెయ్యాలి?" అన్నాడు.

"పంట పెంచాలి. ఆదాయం పెరగాలి. అన్నం రాసులుపోగేసి అందరికీ బువ్వ పెట్టాలి" అన్నారందరు షావుకార్లూ.

"పెదబాబు సలవుండాలకాని తలో సెయ్యేస్తే. దాని సిగతరగా అదేటి సెయ్యగల్దు" అన్నాడు వడ్డికాసులు ముందుకొచ్చి.

"ఈ మహమ్మారికి వుపారంపెట్టి



చల్లాచ్చాలి మీ యిష్టం. ఏం చేదాం చెప్పండి ?"

"సిత్తం సిత్తం. అదే మనివిసేసు కుంటున్నాం. సవందరం పొలమ్మే సెలమేళ్ళ ఆకుమళ్ళకి మాల్లాల, ఒర కట్లు కట్టి గంగమ్మని అదుపులో పెట్టాల. కండయి కరిగి బంగారం కురవాల. ఆదే దారి దాంతోఅన్నీ సద్దుకుంటయి" అన్నాడు జాలయ్య.

"ఇంతమంది మనం రావఁదండులా వున్నాం....ఆమాత్రంచెయ్యలేఁవా?.... ఏంచేసినా మానినా ముందామహమ్మారి

గొంతుపిసకాలి" అన్నాడు పండితుడు కళ్ళొత్తుకుంటూ, కలిసొచ్చిన కల వాళ్ళని కౌగలించుకుంటూ.

"భారతమ్మబిడ్డనే!" అన్నాడు వడ్డి కాసులు.

"ఎంతమాటన్నావు కాసులూ .... అమ్మ సంతతినా?.... నేనన్నదది కాదయ్యాబాబూ .... ఆ బిడ్డనోటి అడుగున అవురావురుమనే రాకాసిని, మహమ్మారిని. మరిడమ్మని .... అ కంఠం కర్ణకఠోరం .... అన్నంతిని, మెత్తబడి శ్రావ్యంగా మంగళ గీతాలు పాడాలి....పీడ వదిలి భారతిబిడ్డ కళ కళ లాడాలి" అన్నాడావేశంలో పండితుడు గొంతు చించుకుంటూ.

పండితుడు గాడిలోపడ్డాడు. కాసులు మూటగట్టిన వడ్డికాసులూ, బాలయ్యా వగైరాలు సమయంచూసి వెనక్కి తగ్గేరు.

"ఏం మాట్లాడరేం?" అని లేచి నిల్చున్నాడు పండితుడు. అందరివేపూ చూసేడు.

"ఎలాగ? ఏడనించి తెచ్చేడతాం?" అని నసిగేరు షావుకార్లు.

"అదేనయ్యా....ఆలోచించండి... ఏదోదారి తియ్యండి....యింత అంగ బలం వుండీ ఏవీ\చెయ్యకపోవడం సిగ్గు చేటు"

"అంగబలం కండబలం చాలుందా బాబూ....అన్నిటికీ మూలం అర్థబలం వుండాలి" అంటూ ముందుకొచ్చేడు కలవాళ్ళ పురోహితుడు.

"అదీ వరస" అన్నారందరూ.

"అందరికోసం కొందర .... వున్నంతలో చిన్నవెత్తు దాచకుంటా మన బంగారం గుమ్మరిద్దాం .... బతుకులు బాగుచేసుకుందాం" అన్నాడు పండితుడు.

"అందరిదీ కలబోసినా ... మన దెంత....ఏ మూలకి సరిపోద్ది ..సవందరంలో కాకిరెట్ట" అని చుట్టకొరికి తుబుక్కున వుమ్మేడు వడ్డికాసులు.

"మరేందారి?"

"పొరుగోల్ల బంగారం మన పొలాలకి ఎరువెయ్యాల....అల్లదే మనపెట్టుబడి కలగా పులగం అయిపోవాల.. యీ లోగా ఏన్నీల్లకి సన్నీల్లలాగ తిండి దిగుబడవ్వాల".

"వాళ్ళని కూడగట్టుకోడం ఎలాగ? వాళ్ళు మనవేపు మొగ్గుతారా?"

"బేసుగ్గా మొగ్గుతారు"

"ఏం?"

"మన జట్టు పెద్దది మనం వెపరితో కలిస్తే ఆడు పెపంచకం పేలేస్తాడు....ఎవడితో కలిసిపోతావాం అని యెయ్యికళ్లెట్టుకు సూస్తన్నరు..అం.. ఏటనుకుంటన్నరో యేటో"

చాకులాంటివాడు పండితుడు. చిన్న నవ్వు నవ్వేడు. అదాసంగతి అన్నట్టు, కాసులుగలవాళ్ళ మొహాల్లోకిచూసేడు. అందరివేపూ మొగ్గు తేసరే అను కున్నాడు.

"సరే వాళ్ళకి మన పరిస్తితి తెలియజెప్పడం వెలాగ?" అన్నాడు.

"ఆ బిడ్డని చూపిస్తేసరి"

"ఎందుకూ ?!"

"జాలి తరంచూసి మూగుతారు.... జాలిపడి డబ్బులు రాలుస్తారు .... బిడ్డ కడుపేనా నిండుద్ది" అన్నాడు పెద్ది కాసులు.

"ఓ ...బిడ్డని ఎరబెట్టి, యాచించ మంటావా ?....లేమిచూపి చెయ్యిజాప మంటావా !" అని కళ్ళెర్ర జేసేడు పండితుడు.

షావుకార్ల పురోహితుడివేపు చూసేడు.

"బుద్ధుడు భిక్షాటనం చెయ్యలేదా బాబూ ?" అన్నాడు పురోహితుడు మళ్ళీ మొందుకొస్తూ.

"మీరనేదీ....? అని తెల్లబోయి నాన్నేడు పండితుడు.

"పేదరికం, ఆకలిలేని దెక్కడ బాబూ? ...పెద్దవాడ్ని చెబుతున్నాను.... లోకంలో వున్నదేలేమి .అదొక్కటే నిజం .... లేమినిచూసి సిగ్గుపడక్క ల్లేదు ..నిజం తెలుసుకుని కుమిలి పోరు పండితులు"

"అంటే ?"

"మరేంలేదుబాబూ....మనకి తల వంపులేదు నాయనా .... ఈశ్వరుడు కపాలంచేత బట్టుకుని అమ్మా అన్నం అని వీధిన బడలేదూ ?.... అదనే చేయగా లేంది మనం చేస్తే తప్పా. బాబూ ?

"మీరు చెప్ప బోయే దేదో మాటిగా సెలవియ్యండి"

"తనకి గడవదనా బాబూ అతగాడు బిచ్చమెత్తుతున్నాడు ? కుబేరుడు స్నేహితుడు....లక్ష్మీపతిఅర్చకుడు.... మేసేకామధేనువు కల్పలత చిగురించే మేరువువిల్లు .... ఏంలోటని ఆ తాత్రయం చెప్పుమరి .... ఎవరికోసం వంటావు ?" అని నవ్వేడు పురోహితుడు.

"చెప్పండి" అన్నాడు పండితుడు.

"వినుమరి....తనేదిక్కని నమ్ముకున్న దిక్కుమాలిన దీనులకోసం దరిద్ర దామోదరులకోసం ... గర్భ దరిద్రుల ప్రతినిధి యాచకుడు కాక మరేమవుతాడో ? నువ్వేచెప్పు ...బుద్ధిమంతుడివి ఆలోచించుబాబూ"

"యాచనా....బిచ్చమా ? మ్చ్"

"యాచనేమరి....వున్నవాళ్ళ దగ్గర మిగులూ తగులూ జోలిపట్టి లేనివాళ్ళకి సద్దుబాటు చేయిస్తాడు."

"ముష్టికెళితే ఛీ ఛీ అనరూ....ఆ అవమానమో ?"

"అదేవిషం.... ఆ గరళాన్ని దిగమింగి....సేకరించిన అమృతాన్ని.... దిక్కుమాలినవాళ్ళనోట చిలుకుతాడు" అని చమత్కరించేడు కలవారి పురోహితుడు.

"ఇదంతా తమరెందుకు సెలవిచ్చినట్టు ?" అన్నాడు పండితుడు సందేహిస్తూ.

"భిక్షాటనంలో నా మోషిలేదని చెప్ప టానికి"

"జోలెవరు పట్టుకుంటారుమరి ?" అని వెర్రి నవ్వు నవ్వేడు పండితుడు.

-"ఈశ్వరుడు"

"ఎవరూ ? ఈశ్వరుడా ! ఆయనెక్కడ దొరుకుతాడు మనకి ? మన తరంవా ?"

"దొరకడం .... వెదకడం .... హయ్యోరామ ! యిక్కడేవుంటే"

"ఏడీ ? !" అని కళ్ళప్పగించి చూసేడు పండితుడు.

"ఇదుగో ...." పండితుడివేపు చూపుడువేలు సూటిగా చాచేడు పురోహితుడు.

"నేనా !"

"నువ్వే .... నలభైకోట్ల దిక్కుమాలిన ఆకలి నోళ్ళకి నువ్వే పెద్దవి ... మహమ్మారి పిశాచపిండానికి నువ్వే పూజారివి .... అందరికీ నువ్వే ప్రతినిధివి భారతమ్మ గారాల బిడ్డవి .... పండితుడివి, సమదర్శనుడివి....నువ్వు కొంగుపడితే కాసులు ఘల్లన రాల్తాయి..."

"నేనా !"

"నువ్వే....తల్లి ఋణం తీర్చుకో"

"నేనా ... ఈశ్వరుణ్ణా !" అని కంగారుపడ్డాడు పండితుడు.

"ఆఁ ...నువ్వే.... యీ పరగణాకి రాజువి.... కోటికిపడగెత్తిన మహారాజు బిడ్డవి .... నా విష్ణుః పృథ్వీపతిః అన్నారు. నువ్వు కాన్దేవిఁటి ?....ఈశ్వరుడివి నువ్వే విష్ణువ్వి నువ్వే .... అన్నీ నువ్వే, అందరూ నువ్వే .... నువ్వే నువ్వే....లే బయల్దేరు .... ఉత్తిష్ఠ ధనంజయ !— అని గుక్కతిప్పుకోకుండా సార్వభౌమత్వం ఆపాదిస్తూ పండితుణ్ని వుత్తేజపరిచేడు షావుకార్ల పురోహితుడు.

వుక్కిరి బిక్కిరైపోయేడు పండితుడు, వుప్పొంగిపోయేడు "సరే మీ యిష్టం" అన్నాడు హుందాగా పావురాన్ని దువ్వుతూ.

పద్దెనిమిదిషావుకార్ల కుటుంబాలూ సమావేశమై ఆసాయింత్రమే కుటుంబ పురోహితుడికి ఘనసత్కారం చేసేరు, దండిగా సంభావన లిచ్చేరు. తాంబూలాలు సమర్పించేరు.

రచ్చబండ దగ్గర రగడలురేగేయి, తీర్మానాలు సాగేయి, ఎన్నికలు జరిగేయి. పంచాయితీ యేర్పడింది. అంతా షావుకార్ల తైనాతీలు నిండిపోయేరు. ఊరి వ్యవహారాలు చక్కబెడతారని ప్రమాణాలు చేసేరు. ముతకబట్టలు కట్టుకున్నారు, నూలు వడుకుతూ ధర్మపన్నాలు వల్లించేరు. ప్రణాళికలు రచించేరు, పత్రికాలు వేసేరు. దేశదేశాలూ తిరిగి భిక్షామృతం జడివాన కురిపించేడు. పండితుడు వున్నవాళ్ళే జాగ్రత్త పెడతారని పద్దెనిమిది కుటుంబాలనూ సంపదకి ధర్మకర్తలు చేసేడు, వాళ్ళే అందరి సౌఖ్యానికి వ్యవహర్తలు.

ఉర్లూ, తాతావంశాల బంధువర్గం

పొలిమేరలదాకా తామర తంపరలా అల్లుకుపోయింది, దేశ దేశాల షావుకార్లు తరలి వచ్చేరు. బాగుపడదామని సంకల్పించేడు మనిషి. మనసును నియమించేడు, యంత్రాలు సంధించేడు, కొండలు దొలచేడు, కోనలు కాల్చేడు, లోహాలవారులు వేసేడు, లక్ష్మికి పూలరహదారులు పరిచేడు. నదుల గతులుమార్చి కుదుటబెట్టి పొలాలకి మళ్ళించేడు. నింగినుండిదూకే కొండవాగుల జలపాతాల్లో తళుక్కుమనే విద్యుత్తును పుడికిపుచ్చి గుప్పిట బంధించేడు. కోటి దీపాలు గుప్పుమన్నాయి. గుడిసె గుడిసెలో గోరంత దీపం చిరునిమి పెడదామని మురిసిపోయేడు జోలిపట్టిన పండితుడు, కోటిపద్మాలు పూసిస్తాయని సంబరపడ్డాడు. చీకటి గుడిసెల్లో ఒక్కదివ్వె. ఒక్కప్రమిద వెలగలేదు. మచ్చుకి ఒక్కతామర మొగ్గ తొడగలేదు.

అన్నాన్ని పండించిన మనిషి ఆకలిని పండేడు, వెలుగురగిల్చిన మనిషి చీకటిని పులిమేడు.

ఉల్లా సంకం ధర్మం కాతాలోంచి డబ్బు కేటాయించింది, రాకాసిబిడ్డ చుట్టూ బంగారంతాపి పాలరాతి గోపురాలు కట్టేరు. బృందావనాలు నాటేరు. స్వాములొచ్చేరు. బిషప్పు లొచ్చేరు. మౌల్వీలొచ్చేరు. తెల్లవాళ్ళు, నల్లవాళ్ళు, ఎర్రవాళ్ళు, పచ్చవాళ్ళు రకరకాల వాళ్ళందరూ వస్తూనే వున్నారు, ధర్మం విరివిగా తరలిస్తూనే వున్నారు. ధర్మకర్తలు జమా ఖర్చులు వేస్తూనే వున్నారు. తిండిగింజలూ, పాలడబ్బాలూ సప్యంగా సరఫరా చేసేందుకు కట్టుదిట్టాలు చేస్తూనేవున్నారు. టిన్నుకోటుక్క, టన్నుకోగింజ భారతి బిడ్డ నోటికందుతున్నాయి. ఇరవై యేళ్ళు పైబడ్డాయి. కోరికలు రెచ్చిపోతున్నాయి, ఆకలి దహించేస్తోంది,

"నన్నెవరూ చూడరేం? ...నాకేవీం పెట్టరేం .... మింగేస్తాను ... మింగేస్తాను .. హాం" అంటూ ఆకాశాన్ని అప్పళిస్తూ ఒళ్ళు విడచుకు వూరుమీద పడబోయిందా రాకాసిబిడ్డ.

నివ్వెరబోయేడు పండితుడు.

"పంట పెరిగింది .... లాభాలొస్తున్నాయి. సంపదహెచ్చింది .... ఏదీ అదంతా? ఏమైంది? మహమ్మారి మళ్ళీ లేచిందేం?.... మాట్లాడరేం?" అని గాంభ్రమని గర్జించేడు పండితుడు.

"పెడుతున్నాంగా మహమ్మారికి వుపారం పెడుతున్నాంవే" అన్నారు ధర్మకర్తల తైనాతీలు పంచాయితీలో.

"పెడుతున్నారు గింజా అరా.... ఏం పెడుతున్నారు? శార్ధం" అని విసుక్కున్నాడు పండితుడు.

"వడ్డీలూ, వాశీలూ, పన్నులూ పంపిణీకు అధికారుల ఫలహారాలుఅన్నీ చూపి మిగిలిందంతా దానెదాన్నె కొడుతున్నాం .... రోజు రోజుకీ పెరిగిపోతుంటే ..మేవేం చెయ్యగలం?"

"అంటే?"

"వున్న నోళ్ళే నింపలేకచస్తున్నాం.... కొత్తనోళ్ళుతెస్తుంటే ఎవరితరం?" అన్నారు. నోళ్ళలెక్కల బేకీజులు చూపిస్తూతైనాతీలు.

"ఆకలి నోళ్ళు మూయించటం ఎవరితరం? విడితేవిడతాయి, సంపదంతా ఏమైపోయింది.

పంటంతా ఏమైపోయింది?" అని రెట్టించేడు పండితుడు.

"నిక్షేపంలావుంది. నోళ్ళు పెరిగిపోతుంటే ఎవరేం చెయ్యగలం?"

"మీ వుద్దేశ్యం?"

"ఏంలేదు. సంపద పల్చబడకుండా వుండాలంటే కొత్త నోళ్ళు తెరవకూడదు."

"అంటే బిడ్డని నోరు మూసి చంపాలంటారా?"

"రావఁ గావఁ అంత మాటంటాఁవా?"

"మరైతే ఆ బిడ్డకి కడుపునిండా


# ఉదరాంతకి

చంటి పిలల సమస్త అనాసలు, లివర్ అండ్ స్లీన్సు వ్యాధులు నివారించి ఆరోగ్యవంతులుగా చేయును

# అమృత సంజీవిని మాత్రలు

గర్భిణీ స్త్రీలకు కలుగు సమస్త వ్యాధులుపోగొట్టి తల్లికి గర్భస్థ శిశువునకు బలముకలిగించి సుఖ ప్రసవము సత్సంతానము కలుగజేయును

## శ్రీ భుజంగరావైద్యశాల

ప్రొప్రయిటర్సు: "భిషక్ శిరోమణి" పొన్నాడ పేరయ్య అండ్ సన్స్
తాళ్ళరేవు, తూర్పుగోదావరి జిల్లా.

అన్నం పెట్టండి" అని హుకుం జారీ చేసేడు పండితుడు.

"బిడ్డమీద మమకారంతో.. యిసం పెడతావా ?....తిన్నంతా ఎడితే అజీర్తి తిసేసి సద్దుకుంటది."

"పీడాపోయిరి" అని విసుక్కున్నాడు పండితుడు తర్కాన్నిపని అసహ్యించుకుంటూ

చివుక్కుమంది భారతి మనసు. పడుకుతున్న నూలుకండి చెయ్యిజారిపోయింది. దారపుండ వేరే లేదు. రక్తం అప్పుకుపోయిన గుండెలోంచి యెండిపోయిన నరాలూ నాడులూ పడుకుతోంది. శాప తిన్న అహల్యలా సొమ్మసిలి నేలకూలి పోయింది.

"సస్తే ఏటుంది బూడిద. ఆ బిడ్డ వుండాల" అన్నాడు జాలయ్య.

"ఆకలి కడుపున్నా ఒక్కటే చచ్చినా ఒక్కటే" ఛీదరించుకున్నాడు పండితుడు.

"ఊపిరి పచ్చగుండాలంటే. ఆ బిడ్డ బతికుండాల."

"బతికేంలాభం ? చల్లగా వుండాలి."

"సచ్చాకూడదు. సల్లగుండాకోడదు. పొంగోల్లసొత్తుదిగు మతవ్వాలంటే" అన్నాడు దొంగ దగ్గు దగ్గుతూ వడ్డికాసులు.

"ఎంత తెచ్చినా ఏంలాభం. మింగడానికే చాల్టంలేదు. మన్నుతిన్న పాములాగ ముందుకి జరగడంలేదు మనం. ఇంటి దొంగని యీశ్వరుడే పట్టలేడు. యింక చాలు బుద్ధొచ్చింది" అంటూ వుగ్రుడై పోయేడు పండితుడు.

"దొంగ వెధవల్లారా ! దౌర్భాగ్యుల్లారా ! యిదా మీ పన్నాగం ? జమాఖర్చులు చెప్పండి, పొలాలు కాళీ చెయ్యండి, కార్ఖానాలు స్వాధీనం చెయ్యండి. యిదంతా ఎవరి సొమ్మనుకుని భోంచేసేరిన్నాళ్ళూ ? తాతగారిదా బాబుగారిదా ?" అని ధూంధాం అన్నాడు.

ఒగ్గిమంటే అంతసులబమేటి ? ఆదరాబాదరాగా యిడిసి పొమ్మంటే ఎలా సస్తాం ? ఎట్టిన పెట్టుబడికి వడ్డీయేనా కిట్టుబాటవనేదు" అన్నాడు వడ్డికాసులు.

"ఏడిసేవు. పెట్టుబడిట పెట్టుబడి. ఎక్కడినుండి తెచ్చేరూ బేంకుల్లో అప్పులే గదూ? అంతా యిందులోనె దెబ్బతింటే. కుప్పిగెంతులుమాని మర్యాదగా అప్పజెప్పండి"

"అప్పజెప్పకపోతే ?" అని గుడ్లురిమేయి తాతా, ఉగ్రావంశాలు.

"చూస్తాను" అని పంజావిప్పేడు పండితుడు.

కచ్చలు సద్దుకుని పనుగులెత్తేరు వడ్డికాసులూ, జాలయ్యా, ఊరవతల అందరూ గుట్టుగా కూడబలుక్కు-

న్నారు. దారం తింగలేదు, వాళ్ళ తైనా తీలు ఎదురు తిరిగేరు. అల్లర్లు లేవదీసేరు. ఉత్తరాది పొలిమేరదాటి చెదపుట్టల్లాగ వచ్చిన దోపిడీముఠా వూరిమీద విరుచుకుపడింది. మిడతలు పోయాయనుకుంటే చెదలు దాపురించేయి. తెల్లబోయేడు పండితుడు. మీసాలెగదువ్వేరు జాలయ్య, వడ్డి కాసులూ.

దొంగదెబ్బకి పండితుడి గుండె చిదిగిపోయింది. పో చెక్కి పగిలిపోయింది. "అమ్మాయి భారతీ! ...దగాపడ్డానమ్మా ...మన్నించు తల్లీ" అని కళ్ళు మూసేడు.

ఊరంతా కుంగిపోయింది. బిడ్డ భారం ధర్మకర్తలు నెత్తిన వేసుకున్నారు. పండితుణ్ణి పదే పదే (వి)స్మరిస్తూ వ్యవహారాలు చక్కబెడుతున్నారు.

సంపద పెరుగుతూనే వుంది, లాభాలు బేంకుల్లోకి వెళుతూనే వున్నాయి. ప్రతినిధులు దేశదేశాలు వెళ్తూనేవున్నారు. నోరూ వాయూ లేని అమాయకులు కటకటాల వెనక్కి వెళ్తూనేవున్నారు. ఆహారం పండుతూనే వుంది. దిగుమతి అవుతూనే వుంది. మహమ్మారి చల్లారలేదు. ఆ గోడు వింటే గుండె చెరువైపోతుంది.

"ఎలాగ? ఏం దారి?" ఏభై కోట్ల గొంతుకలు ఏకశృతిలో నినాదం చేస్తున్నాయి.

"ఎలాగ? .. ఎలాగ?" చేతుల్ని నలుపుకుంటూ ఆ గొంతుకల్ని మూగ చేస్తూ మరీ బిగ్గరగా గగ్గోలుపెడుతున్నారు ధర్మకర్తలు. ధర్మకర్తల గొంతుకే వినబడుతోంది.

ఎలాగ?

ఎంపు మహమ్మారి? . ఏం దారి?

* * *

మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్‌సాల్
చికిత్సను పొందండి
-శస్త్రచికిత్స
అవసరములేదు!
OOL-327/1 TO